క్లుప్తంగా

అవగాహన సదస్సు

కైలాస్‌నగర్: జూనియర్, డిగ్రీ లెక్చరర్ పరీక్షలపై జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సైన్సెస్ డిగ్రీ కళాశాల ప్లేస్‌మెంట్ సెల్, ఎన్ఎస్ఎస్‌ల ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. కళాశాల ప్రిన్స్‌పాల్ జగ్రామ్ అంతర్వేది మాట్లాడుతూ.. అభ్యర్థులు అధ్యాపకులు చెప్పే విషయాలను అవగాహన చేసుకొని ఉద్యోగాలు సాధించాలని ఆకాంక్షించారు. అధ్యాపకులు జాకీర్ హుస్సేన్, శ్రీనివాస్, రఘునాథ్, ప్రతాప్‌సింగ్, సంతోశ్ కుమార్ పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన మాజీ ఎంపీ, జెడ్పీటీసీలు

తాంసి: రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖమంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావును ఆదిలాబాద్ మాజీ ఎంపీ గోడం నగేశ్, తాంసి జెడ్పీటీసీ తాటిపెల్లి రాజు, భీంపూర్ జెడ్పీటీసీ కుమ్ర సుధాకర్ కలిశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని మంత్రి కార్యాలయంలో సమస్యల పరిష్కారానికి ప్రత్యేక నిధులు విడుదల చేయాలని కోరారు. వారి వెంట బోథ్ ఎంపీపీ తుల శ్రీనివాస్ ఉన్నారు.

అగ్నిప్రమాదాలపై అవగాహన

ఆదిలాబాద్: అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఆదిలాబాద్ ఆర్టీసీ డిపో గ్యారేజీలో శుక్రవారం అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదం చోటు చేసుకుంటే తీసుకోవాల్సిన చర్యలు, పాటించాల్సిన జాగ్రత్తలను వివరించారు. స్వయంగా మంటలు ఆర్పే విధానాన్ని ప్రత్యక్షంగా చూపించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్‌వో శివాజీ, ఆర్టీసీ అధికారులు, ఫైర్, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు

జేపీఎస్‌లకు ఆర్థికసాయం

కైలాస్‌నగర్: తమ సర్వీస్‌ను క్రమబద్ధీకరించాలనే డిమాండ్‌తో జూనియర్ పంచాయతీ కార్యదర్శులు చేపట్టిన సమ్మెకు బీజేపీ నాయకుడు కంది శ్రీనివాసరెడ్డి సంపూర్ణ మద్దతు ప్రకటించారు. శుక్రవారం సమ్మె శిబిరాన్ని సందర్శించి రూ.50 వేల తక్షణ ఆర్థిక సాయం అందజేశారు. కార్యదర్శులు చేపట్టే ఆందోళనలకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో చంద్రశేఖర్, ప్రశాంత్, గంగన్న, రాజు, అజర్ అరుణ్ పాల్గొన్నారు.

తపాలా సేవలను సద్వినియోగం చేసుకోవాలి

నేరడిగొండ: తపాలాశాఖ సేవలను సద్వినియోగం చేసుకోవాలని నిర్మల్ పోస్టల్ అధికారి ఎండీ షఫీఉద్దీన్ కోరారు. శుక్రవారం మండలంలోని బోరిగాంలో బ్రాంచ్ పోస్ట్ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తపాలా శాఖ ద్వారా అనేక పథకాలను అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంవో మునీర్ అహ్మద్, సర్పంచ్ నీలాబాయి, గ్రామస్తులు జాదవ్ పవన్, తదితరులు పాల్గొన్నారు.

ఫొటోగ్రఫీలో అవార్డు



అవార్డు అందుకుంటున్న మహేశ్

ఉట్నూర్‌రూరల్: హైదరాబాద్‌లో నిర్వహించిన సిగ్మా అకాడమీ ఆఫ్ ఫొటోగ్రఫీ హైదరాబాద్, సాలార్‌జంగ్ మ్యూజియం, సాంస్కృతిక శాఖ, భారత ప్రభుత్వం సంయుక్తంగా నిర్వహించిన వార్షిక అవార్డుల ప్రదానోత్సవంలో మండలానికి చెందిన ఫొటోగ్రాఫర్ మరికంటి మహేశ్‌కు అంతర్జాతీయ లైసినెట్‌షిప్ అవార్డు అందుకున్నారు. సమావేశంలో సిగ్మా అకాడమీ చైర్మన్ శేఖర్, సెక్రటరీ జనార్దన్, జవహర్‌లాల్ నెహ్రూ ఫొటోగ్రఫీ యూనివర్సిటీ ప్రొఫెసర్లు మధుకర్, ప్రదీప్‌కుమార్ పాల్గొన్నారు.

వైద్య శిబిరం



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని మామిడిగూడ సబ్ సెంటర్ పరిధిలోని మంగ్లీ గ్రామంలో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. గర్భిణులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. అలాగే చిన్న పిల్లలకు ఇమ్యూనైజేషన్ టీకాలు వేశారు. ప్రభుత్వ ఆసుపత్రిలోనే ప్రసవాలు చేయించుకోవాలని సూచించారు. ఆరోగ్య పర్యవేక్షకులు మర్సకోల లక్ష్మిబాయి, సిబ్బంది ప్రేంసింగ్ పాల్గొన్నారు.

చెరుకు పంట దగ్ధం

ఉట్నూర్‌రూరల్: మండలంలోని పులిమడుగు గ్రామంలో షార్ట్‌సర్క్యూట్‌తో చెరుకు పంట దగ్ధమైంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పులిమడుగు గ్రామానికి చెందిన రైతు జాదవ సంతోశ్ 1.2 ఎకరాల్లో చెరుకు పంట సాగు చేస్తున్నాడు. పైనుంచి వెళ్లే విద్యుత్ తీగలతో మంటలు చెలరేగి పంట దగ్ధమైంది. దాదాపు రూ. 2 లక్షల వరకు నష్టం వాటిల్లిందని రైతు వాపోయాడు.

అప్రమత్తతే శ్రీరామ రక్ష

- వాతావరణంలో మార్పులు
- విద్యుత్‌షాక్, పిడుగుపాటుకు బలవుతున్న అన్నదాతలు
- ఇటీవల పెరిగిన ప్రమాదాలు
- జాగ్రత్తలు పాటిస్తేనే మేలు



సిరికొండ: వాతావరణంలో ఒక్కసారిగా చోటు చేసుకుంటున్న మార్పులతో ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురుస్తుంది. అంతేకాకుండా పొలాలల్లో, ఇంటి పరిసరాల్లో పిడుగులు పడుతున్నాయి. ఇటు పిడుగులు, విద్యుత్‌షాక్ ప్రమాదాలతో రైతులు, పశువులు బలి అవుతున్నాయి. ఇటీవల ఇలాంటి ప్రమాదాలు పెరగడంతో రైతన్నలు ప్రాణాలు విడుస్తున్నారు.

ఉరుములు, మెరుపులు..

జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తున్నాయి. ఇదే సమయంలో పిడుగులు పడుతున్నాయి. వ్యవసాయ పనుల్లో రైతులు, కూలీలు, గొర్రెల కాపరులు ఎక్కువగా పిడుగుపాటుకు గురి అవుతున్నారు. బుధవారం ఒకేరోజు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలంలోని రాజుర గ్రామానికి చెందిన పాతకుంట రాజు అనే యువకుడు పిడుగుపడి మృత్యువాత పడ్డాడు. తలమడుగు మండలం లోని సుంకిడి గ్రామానికి చెందిన అజయ్‌రెడ్డి చెందిన ఎద్దు, భోథ్ మండలంలోని ధన్నూర్ గ్రామానికి చెందిన ఎడ్మల హనుమంత్‌కు చెందిన గేదె విద్యుత్ షాక్‌కు గురై మృత్యువాత పడ్డాయి.

జాగ్రత్తలు పాటించాలి..

- ఈదురుగాలులు వచ్చే సమయంలో వ్యవసాయ పనులు త్వరగా ముగించుకోవాలి.
- వర్షం పడే సమయంలో బహిరంగా ప్రదేశాల్లో, చెట్ల కింద ఉండవద్దు.
- పశువులను బయట ఉంచకూడదు. వాటిని కొట్టంలో కట్టేయాలి.
- పంట పొలాలకు వెళ్లేటప్పుడు విద్యుత్ కంచెలు లేకుండా చూసుకోవాలి.
- ట్రాన్స్‌ఫార్మర్ల సమీపంలో ఉండకూడదు.
- విద్యుత్ స్తంభాలను తాకవద్దు.
- ఇంట్లో ఉన్న స్విచ్‌బోర్డులను ముట్టుకోవద్దు.

అటెన్షన్ ప్లీజ్.. రోడ్డుపైనే మురుగునీరు



నేరడిగొండ: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలకు వెళ్లే రహదారిపై మురుగునీరు ప్రవహిస్తోంది. దీంతో ప్రజలు, రోగులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

- అధికారి పేరు: రాఘవ, పంచాయతీ కార్యదర్శి, నేరడిగొండ, ఫోన్: 85558 44001

సభ విజయవంతం చేయండి

సిరికొండ: ఎస్సీ, ఎస్టీ, బీసీ స్వరాజ్య స్థాపన కోసం దళిత శక్తి ప్రోగ్రాం రాష్ట్ర అధ్యక్షుడు విశారధన్ చేపట్టిన పాదయాత్ర పూర్తయిన సందర్భంగా ఈనెల 30న హైదరాబాద్‌లో పాదయాత్ర ముగింపు సభ నిర్వహించడం జరుగుతుందని మండల అధ్యక్షుడు రాజు తెలిపారు. శుక్రవారం సభ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ప్రజలు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో దళిత శక్తి ప్రోగ్రాం మండల ట్రెజరీ లక్ష్మణ్, స్వామి, శ్రీనివాస్, వెంకటేశ్, నవీన్, ఉమేష్, రాకేశ్, నరేశ్ పాల్గొన్నారు.

నేరడిగొండ: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల రాజ్యస్థాపన కోసం విశారధన్ మహారాజ్ చేస్తున్న స్వరాజ్య పాదయాత్ర ముగింపు సభ పోస్టర్‌ను డీఎస్పీ మండల కన్వీనర్ దేవేందర్, ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ శుక్రవారం ఆవిష్కరించారు. ఈనెల 30న హైదరాబాద్‌లోని ఎల్‌బీనగర్‌లో సాయంత్రం 4 గంటలకు ముగింపు సభ నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో శంకర్, సుద్దాల లక్ష్మణ్, శేందర్, రిజ్వాన్, కార్తీక్, రవీందర్, నరేందర్, అశోక్ పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న డీఎస్పీ నాయకులు

ఉట్నూర్‌రూరల్: విశారధన్ మహరాజ్ పదివేల కిలో మీటర్ల పాదయాత్ర పూర్తి చేసుకున్న సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించే సభను విజయవంతం చేయాలని దళిత శక్తి ప్రోగ్రాం ఉట్నూర్ మండల అధ్యక్షుడు అరవింద్ మహరాజ్ కోరారు. శుక్రవారం పాదయాత్ర ముగింపు పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు చిట్యాల మోహన్, చిప్పకుర్తి అంజన్న, మీడియా ఇన్‌చార్జి హరిప్రసాద్, శ్యాం, శంకర్, చరణ్, జంగు, పురుషోత్తం, తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ డబుల్ బెడ్‌రూం ఇళ్లు

- ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగు రామన్న

ఆదిలాబాద్‌టౌన్: అర్హులందరికీ డబుల్ బెడ్‌రూం ఇళ్లు మంజూరు చేస్తామని ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. ఆదిలాబాద్ పట్టణంలోని దస్నాపూర్‌లో వార్డు ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మున్సిపాలిటీలో విలీనమైన వార్డుల్లో అర్హులైన లబ్ధిదారులకు డబుల్ బెడ్‌రూం ఇల్లు మంజూరుతో పాటు గృహలక్ష్మి పథకం అందేవిధంగా చూస్తామన్నారు. గతంలో మావల పరిధిలోని వార్డులు, మున్సిపాలిటీలో విలీనమైన నేపథ్యంలో లబ్ధిదారులు ఎలాంటి ఆందోళన చెందవద్దన్నారు. అధికారులతో చర్చించి అర్హులను పారదర్శకంగా ఎంపిక చేస్తామన్నారు. సమావేశంలో కౌన్సిలర్ భరత్, నాయకులు గంగారెడ్డి, అశోక్, రాంకుమార్ పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

జైనథ్: కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. శుక్రవారం మండలంలోని మేడిగూడలో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు. త్వరలోనే డబుల్ బెడ్‌రూంలు పంపిణీ చేస్తామని, సొంత స్థలంలో ఇంటి నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామన్నారు. మండలంలోని గూడ గ్రామంలో నిర్మించిన వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రారంభోత్సవానికి హాజరయ్యారు. కార్యక్రమంలో ఎంపీపీ మార్శెట్టి గోవర్ధన్, నాయకులు తుమ్మల వెంకట్ రెడ్డి, సర్పంచ్ లింగారెడ్డి, వేణుయాదవ్, రమేశ్, ప్రభాకర్, పురుషోత్తం, తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద యువతి పెళ్లికి చేయూత



సరుకులు అందజేస్తున్న దుర్గం శేఖర్

ఎదులాపురం: దుర్గం ట్రస్ట్ ఆధ్వర్యంలో పలు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని దుర్గం ట్రస్ట్ చైర్మన్ దుర్గం శేఖర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ట్రస్టు కార్యాలయంలో గుడిహత్నూర్ మండలం కొలహరి గ్రామానికి చెందిన నిరుపేద గిరిజన యువతి హర్షిత వివాహానికి అవసరమైన కిరాణా సామగ్రిని అందజేశారు.

నూతన కార్యవర్గ సభ్యులకు సన్మానం

అదేవిధంగా ఇటీవల విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎన్నికైన ప్రవీణ్, మండల కోశాధికారిగా ఎన్నికైన చామంతుల ప్రవీణ్‌లను ఆయన సన్మానించారు. రాజకీయాలకు అతీతంగా సంఘం అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమాలలో ధ్రువ నగేశ్, ప్రజ్ఞ కుమార్, సుదర్శన్, జాడి సుధాకర్, మహేందర్, మోహన్, తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు అందజేత

బజార్‌హత్నూర్: మండలంలోని ఉమార్ద(బి) గ్రామంలో ఇటీవల కురిసిన గాలివాన బీభత్సానికి ఇంటి పైకప్పు లేచిపోవడంతో ధాన్యం, బట్టలు, సామగ్రి పూర్తిగా తడిచిపోయాయి. విషయం తెలుసుకున్న చిన్నహత్నూర్ ఆదివాసీ యువజన సంఘం సభ్యులు శుక్రవారం గ్రామానికి చేరుకొని మడవి అన్నపూర్ణ, కొట్నాక్ మారుబాయి, మాడవి ప్రభాకర్ కుటుంబాలకు నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో మహేశ్, గోపి, జైతు, ప్రవీణ్, అర్జున్, భూమేష్, రమేశ్ పాల్గొన్నారు.

‘బీజేపీ ప్రభుత్వాన్ని గద్దెదించాలి’



మాట్లాడుతున్న ప్రభాకర్‌రెడ్డి

ఎదులాపురం: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని గద్దెదించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్ రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని గాంధీనగర్ కాలనీలో శుక్రవారం సీపీఐ ఇంటింటికీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్ర మోదీని గద్దించకపోతే భారత ఆర్థిక వ్యవస్థ దెబ్బతింటుందన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను పూర్తిగా నిర్వీర్యం చేశారని ఆరోపించారు. దేశంలో మతోన్మాద దాడులు రోజురోజుకు పెరిగిపోతున్నాయన్నారు. కార్యక్రమంలో నాయకులు కుంటాల రాములు. అరుణ్ కుమార్, సురేశ్, కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.

నేడు రక్తదాన శిబిరం

కైలాస్‌నగర్: ప్రపంచ పశువైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం జిల్లా కేంద్రంలోని పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి కిషన్ ఒక ప్రకటనలో తెలిపారు. బెస్ట్ ఫ్రెండ్స్ హెల్ప్ వెల్ఫేర్ సొసైటీ సౌజన్యంతో నిర్వహించే శిబిరాన్ని జయప్రదం చేయాలని కోరారు.

10న విగ్రహ ప్రతిష్ఠాపన

నార్నూర్: మండల కేంద్రంలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని మే 10న నిర్వహించనున్నట్లు దీక్ష గురువు ప్రేంసింగ్ మహారాజ్ తెలిపారు. శుక్రవారం ఆయన విగ్రహప్రతిష్ఠాపన వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. ప్రజలు భక్తిశ్రద్ధలతో పాల్గొనాలని కోరారు. ఆయన వెంట పీఏసీఎస్ చైర్మన్ అడే సురేశ్, ఉప సర్పంచ్ చౌహాన్ మహేందర్, దత్త రాథోడ్, బాల మోహన్ పాల్గొన్నారు.

దొరికిన సెల్‌ఫోన్ అందజేత

బజార్‌హత్నూర్: మండల కేంద్రానికి చెందిన కుస్తే సావిత్రిబాయి గురువారం ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రిలో ప్రసవించింది. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చెందిన 102 వాహనంలో కెప్టెన్ అర్స స్వామి బాలింతను ఇంటికి చేర్చారు. క్రమంలో ఆమె తన సెల్‌ఫోన్‌ను వాహనంలో మర్చిపోయింది. శుక్రవారం వాహనంను శుభ్రం చేస్తుండగా సెల్‌ఫోను గమనించిన స్వామి, కుస్తే సావిత్రిబాయికి అందజేసి నిజాయతీ చాటుకున్నాడు.

కల్వర్టు నిర్మించాలని వినతి

ఇచ్చోడ: మండల కేంద్రంలోని విద్యానగర్ కాలనీలో విఠలేశ్వర మందిర్‌కు వెళ్లే రోడ్డుపై ఆర్ అండ్‌బీ రోడ్డు వద్ద కల్వర్టు నిర్మించాలని శుక్రవారం పంచాయతీ ఈవో సూర్యప్రకాశ్‌కు విద్యానగర్ కాలనీ వాసులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విఠలేశ్వర్ మందిర్ వెళ్లే ప్రధాన రోడ్డుకు కల్వర్టు లేక పోవడంతో కాలనీవాసులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో గట్టు మల్లేష్, ఆత్మారాం, సాయి, తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు

తాంసి: భీంపూర్ మండలంలోని అర్లి(టి) బ్రహ్మగారి ఆలయంలో శుక్రవారం గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నైవేద్యం తయారుచేసి భక్తులకు పంచి పెట్టారు. వర్షాలు కురిసి, పాడిపంటలు సమృద్ధిగా పండాలని పూజలు చేపట్టినట్లు గ్రామపెద్ద రుద్ర గంగయ్య తెలిపారు. సర్పంచ్ లస్మన్న, ఉల్లాస్, అశోక్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆటాపాటలతో విద్యాబోధన

నేరడిగొండ: పోషకాహారంతో పాటు అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఆటాపాటలతో కూడిన విద్యాబోధన చేయడం జరుగుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మంజుల, హెల్త్ సూపర్‌వైజర్ రాంనరేశ్‌లు అన్నారు. శుక్రవారం మండలంలోని యాపల్‌గూడ, బోరిగాం అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ప్రీస్కూల్ గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్, ఆశ కార్యకర్త, చిన్నారుల తల్లిదండ్రులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

‘సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం’



ఇంద్రవెల్లి: సమ్మెలో పాల్గొన్న వీవోఏలు

ఇంద్రవెల్లి: సమస్యలు పరిష్కరించే వరకు పోరాడుతామని ఐకేపీ వీవోఏల మండల సంఘం అధ్యక్షుడు షేక్ ఫెరోజ్, ఉపాధ్యక్షుడు కోట్నాక్ భారిక్‌రావ్‌లు తెలిపారు. శుక్రవారం వీవోఏల సమ్మె 12వ రోజుకు చేరింది. చలీచాలని వేతనంతో కుటుంబ పోషణ భారంగా మారిందన్నారు. కార్యక్రమంలో వీవోఏలు జుగ్నాక్ రాందాస్, రాజమణి, జైపాల్, నిర్మల, తదితరులు పాల్గొన్నారు.

నేరడిగొండ: సీఎం కేసీఆర్‌కు బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనంపై ఉన్న ప్రేమ వీవోఏలపై లేదని బహుజన సమాజ్ పార్టీ బోథ్ అసెంబ్లీ ఇన్‌చార్జి మెస్రం జంగుబాపు విమర్శించారు. మండల కేంద్రంలో ఐకేపీ వీవోఏలు చేపడుతున్న నిరవధిక సమ్మెకు శుక్రవారం మద్దతు తెలిపారు. ప్రభుత్వం వెంటనే సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఆర్గనైజేషన్ సెక్రెటరీ కామ్రే పోశెట్టి, మెస్రం వినోద్, తదితరులు పాల్గొన్నారు.

తాంసి: వీవోఏల డిమాండ్లు నెరవేర్చాలని టీపీసీసీ సభ్యుడు వన్నెల అశోక్ డిమాండ్ చేశారు. శుక్రవారం వీవోఏలకు మద్దతు తెలిపి నిరసన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలని లేదంటే ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. మండల కన్వీనర్ సంతోశ్, హన్మండ్లు, కిష్టన్న, రాజబలి, వీవోఏలు రమేశ్, దాస్, పుష్ప, లత పాల్గొన్నారు.

భిక్షాటన చేస్తూ నిరసన..

భీంపూర్ మండల కేంద్రంలో భిక్షటన చేస్తూ నిరసన తెలిపారు. ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో మండల కేంద్రంలోని దుకాణ సముదాయాల వద్ద భిక్షాటన చేశారు. ఇందులో వీవోఏల మండల అధ్యక్షుడు అరుణ్, దాంజీ, రాణి, స్వామి పాల్గొన్నారు.

సిరికొండ: వీవోఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి, రూ. 26 వేల వేతనం చెల్లించాలని సమ్మె చేస్తున్న వీవోఏలు శుక్రవారం భిక్షటన చేసి నిరసన తెలిపారు. మండల అధ్యక్షుడు బొడ్డు దత్తు మాట్లాడుతూ.. పదకొండు రోజులుగా ఆందోళన చేస్తున్నా.. ప్రభుత్వం స్పందించకపోవడం సిగ్గుచేటన్నారు.

బజార్‌హత్నూర్: మండల కేంద్రంలోని శివాజీ చౌక్‌లో వీవోఏలు చేపట్టిన సమ్మె ఎనిమిదోవ రోజుకు చేరింది. శుక్రవారం మండల కేంద్రంలోని గాంధీనగర్‌లో భిక్షాటన చేసి నిరసన తెలిపారు. కార్యక్రమంలో వీవోఏలు రజని, నిరంజన్, వర్ష, సుజాత, రాజ్యలక్ష్మీ, అశ్విని, ప్రగతి, మురళీ, జైతు, లచ్చయ్య, జానకి పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకులు మద్దతు

ఉట్నూర్‌రూరల్: వీవోఏల సమ్మెకు కాంగ్రెస్ నాయకులు మద్దతు తెలిపారు. శుక్రవారం జెడ్పీటీసీ చారులత మాట్లాడుతూ.. వీవోఏల సమస్యలు పరిష్కరించి, వారికి న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు చంద్రయ్య, సునీల్, విలాస్, అన్నమొల్ల కిరణ్, లింగాల చిన్నన్న, రాజమణి, ఆశన్న, విజయ్, సరోజ, రమేశ్ పాల్గొన్నారు.

వైభవంగా కుంకుమార్చన



గాజులతో అమ్మవారి అలంకరణ

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలో శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆర్యవైశ్య కుల దైవం వాసవి మాత జన్మదిన వేడుకలను వైభవంగా నిర్వహించారు. నిత్యం అమ్మవారిని కొలుస్తూ.. భక్తి ప్రపత్తులను చాటుతున్నారు. ఏడు రోజులుగా వివిధ పూజ కార్యక్రమాలు చేస్తున్నారు. శుక్రవారం సాముహిక కుంకుమార్చన నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అమ్మవారిని గాజులతో అలకరించి ప్రత్యేక పూజలు చేశారు.

ఘనంగా పల్లకి శోభాయాత్ర

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని శ్రీ బాలాజీ వేంకటేశ్వర స్వామి 55వ తిరుక్కళ్యాణ బ్రహ్మోత్సవాలు ప్రారంభయ్యాయి. ఈనెల 27వ తేదీ నుంచి మే 1 వరకు నిర్వహించనున్నారు. శుక్రవారం స్వామివారి ఉత్సవ విగ్రహంతో పల్లకి శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి, భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. అర్చకుడు రాంగోపాల్ శర్మ మాట్లాడుతూ.. నిత్య పూజాది కార్యక్రమాలతో స్వామి వారిని కొలవడం జరుగుతుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

పరామర్శ

బోథ్: మండలంలోని ధన్నూర్ గ్రామానికి చెందిన పీఏసీఎస్ డైరెక్టర్ జిట్ట శ్రీనివాస్ తండ్రి జిట్ట సాయన్న, కుచులాపూర్ గ్రామానికి చెందిన జంగటి మల్లేష్‌లు ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ అధ్యాపకులు సంఘం ప్రధాన కార్యదర్శి బలరాం జాదవ్ శుక్రవారం బాధిత కుటుంబాలను పరామర్శించారు.

ఉట్నూర్‌రూరల్: బీఆర్ఎస్ జిల్లా నాయకురాలు సుమన్‌బాయి తండ్రి రెండు రోజులుగా క్రితం అనారోగ్యంతో మృతి చెందగా.. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్‌వీ జిల్లా అధ్యక్షుడు ధరణి రాజేశ్ శుక్రవారం నాయకులతో కలిసి పరామర్శించారు. ఆయన వెంట రాజ్‌కుమార్, సతీశ్, నజీర్, తదితరులు ఉన్నారు.

పేపర్ డిజైనింగ్‌పై శిక్షణ

బోథ్: మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థులకు సమ్మర్ క్యాంప్ కొనసాగుతోంది. శుక్రవారం న్యూస్ పేపర్లతో డిజైనింగ్ ఎలా చేయాలో నేర్పించారు. వివిధ రకాల డిజైన్ చేసి తమ ప్రతిభ చాటారు. అలాగే రాజకీయ పరిజ్ఞానం, లీడర్‌షిప్ క్వాలిటీస్, విశ్వంలో నక్షత్రాలపై ప్రతిభ చాటిన విద్యార్థులకు క్యాంపు కో ఆర్డినేటర్ స్వర్ణలత ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జ్యోతి, లావణ్య, భాగ్యశ్రీ, రాధ, అఫ్రిన్, గాయత్రి, తదితరులు పాల్గొన్నారు.

వంతెన నిర్మించాలి

బోథ్: మండలంలోని నక్కలవాడకు వెళ్లే రోడ్డు మార్గంలో వంతెన నిర్మించాలని సర్పంచ్ విజయ్ కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. లోలెవల్ వంతెన వల్ల కరత్వాడ ప్రాజెక్టు బ్యాక్ వాటర్ వంతెనపై నుంచి ప్రవహించడంతో నక్కలవాడ, లక్ష్మీపూర్, కొత్తపల్లె, రేండ్లపల్లె గ్రామాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. అత్యవసర సమయంలో మండల కేంద్రానికి రాలేని పరిస్థితి నెలకొంటుందన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

కంటివెలుగు సద్వినియోగం చేసుకోవాలి



పరిశీలిస్తున్న జోగు ప్రేమేందర్

ఆదిలాబాద్‌టౌన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న కంటివెలుగు శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ అన్నారు. శుక్రవారం భుక్తాపూర్‌లో ఏర్పాటు చేసిన కంటివెలుగు శిబిరాన్ని పరిశీలించారు. వయస్సుతో సంబంధం లేకుండా సేవలు అందించడం జరుగుతుందన్నారు. కళ్లద్దాలతో పాటు మందులు అందజేస్తామన్నారు. ఆయన వెంట కౌన్సిలర్ ప్రకాష్, నాయకులు ఉన్నారు.